వేడుకగా 'ప్రజాపాలన'



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న కలెక్టర్ క్రాంతి తదితరులు

- జాతీయ పతాకాలను ఆవిష్కరించిన అధికారులు

సంగారెడ్డి జోన్: ప్రజాపాలన దినోత్సవాన్ని ఊరూరా ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి జిల్లా పరిషత్తు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా కార్యాలయం ఆవరణలోని మహాత్మా గాంధీ, డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఈఓ జానకీరాం, ఆర్డీఓ రాజు, పీఆర్ ఈఈ జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ చెన్నూరి రూపేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ విధులను కర్తవ్యంగా నిర్వహించి, దేశ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థులు నిర్వహించిన నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ వల్లూరి క్రాంతి విద్యార్థులను అభినందించారు.



న్యాల్‌కల్: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ భూపాల్



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బాండ్ పేపర్స్ లబ్ధిదారులకు అందజేస్తున్న రాంరెడ్డి



ఎస్పీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్పీ తదితరులు



హత్నూర(సంగారెడ్డి): తహసీల్దార్ కార్యాలయం వద్ద



కంది(సంగారెడ్డి): తహసీల్దార్ కార్యాలయంలో..



సంగారెడ్డి టౌన్ : ఎంపీడీవో కార్యాలయంలో..



పటాన్‌చెరు టౌన్: జెండాను ఆవిష్కరించిన కాంగ్రెస్ నేత నీలం మధు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ భవనంపై..

క్లుప్తంగా

ఘనంగా విశ్వకర్మ జయంతి

జహీరాబాద్ టౌన్: పట్టణంలో మంగళవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పద్మశాలి భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గణపతి పూజ, ధ్వజారోహణం, విశ్వకర్మ పూజ, యజ్ఞం, ప్రసాద వితరణ చేపట్టారు. సూలపేట మఠం పీఠాధిపతి విశ్వకర్మ దొడ్డేంద్ర మహాస్వామి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం అధ్యక్షులు నాగేంద్రప్ప మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విశ్వకర్మలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న లలిత తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితసోమిరెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్‌లో 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములు గౌడ్, కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ పర్యటన



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పలు సమస్యలను తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరిగారి రమణ ఆయన దృష్టికి తీసుకొనివెళ్లారు. అనంతరం మేళ్ల చెరువు వద్ద జరుగుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, ఆర్‌ఐ శ్రీకాంత్‌లున్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



నీటి సరఫరాపై తెలుసుకుంటున్న తహసీల్దార్ శివశ్రీనివాస్

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్‌లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ శివశ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కృష్ణాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ, చాకలి వాడలో నీటి సరఫరాను, పాడైపోయిన బోరు మోటర్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మల్లేశం, కాంగ్రెస్ నాయకులు తుకారం పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్

నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండల బూర్గుపల్లికి చెందిన నాగమణికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును మంగళవారం ఖేడ్‌లోని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ నాగమణి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కాంగ్రెస్ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, నాయకులు సత్యనారాయణరావు, సాయిలుపటేల్, నెహ్రూనాయక్, సత్యం, భానుగౌడ్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కోహీర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ.3,73,000 విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

గీతంలో నూతన ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న జోగిందర్

పటాన్‌చెరు: తెలంగాణ ప్రభుత్వంలోని టీ–వర్క్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జోగిందర్ తనికెళ్ల మంగళవారం రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో అత్యాధునిక 'టెక్నాలజీ ఎక్స్ ప్లోరేషన్ అండ్ ప్రొడక్ట్ ఇంజనీరింగ్ ల్యాబొరేటరీ' (టీఈపీ)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుమారు రెండు కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రొఫెసర్ శాస్త్రి తెలిపారు. కార్యక్రమంలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్.రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, డీన్–కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల, ఎంఎస్ ఎంఈ నోడల్ అధికారి అరవింద్ బాబుల తదితరులు పాల్గొన్నారు.

వినాయక లడ్డూ రూ.7.8లక్షలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వినాయక నవరాత్రుల సందర్భంగా మంగళవారం రాత్రి పట్టణంలోని అశోక్‌నగర్ వినాయక మండపం వద్ద నిర్వహించిన వినాయక లడ్డూను రూ.7.8లక్షలకు భవానిపురానికి చెందిన సత్యనారాయణ దక్కించుకున్నారు. సోమవారం రాత్రి తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదులనాగులపల్లి లిటిల్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని వినాయక లడ్డూను రూ.3.67లక్షలకు వెలిమెలకు చెందిన రాజ్‌కుమార్, అలాగే రామచంద్రారెడ్డినగర్ కాలనీలోని వినాయక మండపం వద్ద లడ్డూను రూ.2లక్షలకు తాళ్ళ పద్మకుమార్ గౌడ్, జనరల్ లడ్డూను వెంకట్ రెడ్డి, విజయ దంపతులు రూ.2.21లక్షలకు కైవసం చేసుకున్నారు.

రూ.3.35లక్షలు పలికిన లడ్డూలు

పటాన్‌చెరు టౌన్: గణేష్ గడ్డ దేవాలయంలో పూజలు అందుకున్న గణనాథుని వద్ద ఉంచిన మూడు లడ్డూలకు మంగళవారం వేలం నిర్వహించారు. మొదటి లడ్డూను రుద్రారం గ్రామానికి చెందిన గడ్డమీది నవీన్ రూ.1లక్ష 75వేలకు, రెండో లడ్డూను పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలో ఉంటున్న ఒడీఎఫ్ ఉద్యోగి వేణుగోపాల్ రూ.1లక్ష 10వేలకు, మూడో లడ్డూను రుద్రారం గ్రామానికి చెందిన గడ్డమీది కుమార్ రూ.50వేలకు దక్కించుకున్నారు. మూడు లడ్డూలు కలిపి రూ.3లక్షల 35వేలు పలికాయి. దీంతో ఆలయ అర్చకులు, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ శశిధర్, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ వారిని సన్మానించారు.

రూ.1,55,555 లకు..

నారాయణఖేడ్: ఖేడ్ జంటగ్రామమైన మంగల్‌పేటలో శివాజీదళ్ ఆధ్వర్యంలో లడ్డూను మంగళవారం వేలం వేశారు. మంగల్‌పేటకు చెందిన భక్తుడు బి.ఎస్.వీరశెట్టి రూ.1,55,555లకు వేలం పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ లడ్డూను అందజేశారు.

స్వచ్ఛతా హీ సేవను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేశ్‌కుమార్

జోగిపేట(అందోల్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రాజేశ్‌కుమార్ సూచించారు. మంగళవారం జోగిపేట ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామకార్యదర్శులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీఓ అశోక్, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

కల్హేర్(నారాయణఖేడ్): పరిసరాలను తప్పనిసరిగా శుభ్రంగా ఉంచాలని తహసీల్దార్ శివ శ్రీనివాస్, ఎంపీడీఏ రమేశ్‌బాబు సూచించారు. మంగళవారం కల్హేర్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ కృష్ణచారీ, కాంగ్రెస్ నాయకులు లతీఫ్, బేగరి సాయిలు, అలిగె నాగరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండల కేంద్రంలో మంగళవారం డీఎల్‌పీఓ సంజీవ్‌రావు ఆధ్వర్యంలో అధికారులు మొక్కలు నాటారు.

తెలంగాణ తల్లిని అవమానించేలా నిర్ణయాలు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టే సిగ్గుమాలిన చర్య అని ధ్వజమెత్తారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టుకుంటే తమకు అభ్యంతరం లేదని, తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ చర్య ప్రతీ తెలంగాణ వ్యక్తి మనస్సును గాయపర్చేలా ఉందని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తాను చేసిన తప్పును సరిదిద్దుకోవాలని సూచించారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఓ కవిత

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రంలోని శ్రీగురు ఇండియన్ గ్యాస్ ఆధ్వర్యంలో గ్యాస్ వాడకంపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. మంగళవారం ఉదయం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఇండియన్ గ్యాస్ ఎస్‌ఓ కవిత హాజరై ప్రసంగించారు. ఇంట్లో గ్యాస్ వినియోగించిన తర్వాత పూర్తిగా ఆఫ్ చేయాలని, గ్యాస్ లీక్ ఐతే కిటికీలు, తలుపులు పూర్తిగా తెరిచి విద్యుత్ దీపాలను ఆర్పి వేయాలన్నారు. నిబంధనల ప్రకారం గ్యాస్‌కు ఉపయోగించే పైప్‌లను మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, మేనేజర్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజుతో పాటు వినియోగదారులు పాల్గొన్నారు.

కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి




పెరటికోళ్లను పంపిణీ చేస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే

నారాయణఖేడ్: మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయం ఆవరణలో మంగళవారం ఖేడ్, మనూరు, కల్హేర్ మండలాల్లోని స్వయంసహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళాశక్తిలో భాగంగా పెరటికోళ్లను, స్కూల్ యూనిఫాం కుట్టిన మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. ఖేడ్ మండలం గంగాపూర్, తుర్కపల్లిల్లో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, డీఈ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గణేశ్‌గడ్డ ఉత్సవాలు



సంగారెడ్డి టౌన్: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



పటాన్‌చెరు టౌన్: గణనాథుడుకి పండ్లతో అలంకరణ

- విశేష అలంకరణలో స్వామి దర్శనం
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలోని గణేశ్ గడ్డ దేవాలయంలో ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్ర శేఖర్, అయ్యప్ప, సతీష్ స్వామి వారిని వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి గణపతి హోమం నిర్వహించారు. అనంతరం పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో శశిధర్, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్లు తెలిపారు. అదే విధంగా ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం సాగుతుందని తెలిపారు.



ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

సంక్షిప్త వార్తలు

◆ గిరిజనుల సేవాలాల్ దీక్ష ప్రారంభం

పుల్‌కల్(అందోల్) : పుల్‌కల్ మండలంలో బంజారా యువకులు సేవాలాల్ దీక్ష చేపట్టారు. ఆల్ ఇండియా బంజారా లంబాడా జాతీయ శక్తి పీట్ సహాయకార్యదర్శి విట్టల్ మహారాజ్ నేతృత్వంలో యవకులు సేవాలాల్ దీక్షను తీసుకున్నారు. 40 రోజుల పూజల అనంతరం మహారాష్ట్రలోని పొరాదేవి ఆలయానికి వెళ్లి దీక్షను విరమిస్తారని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ తెలిపారు.

◆ పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యం

సంగారెడ్డి టౌన్ : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు చేపడుతుందని సంగారెడ్డి మండల ఎంపీడీవో యాదగిరి అన్నారు. మంగళవారం సంగారెడ్డి మండలంలోని పసల్వాది గ్రామంతోపాటు పలు గ్రామాల్లో కార్యక్రమాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 17 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు రోజువారి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

◆ ఇంకా నీళ్లలోనే పంటలు

కంది(సంగారెడ్డి): వర్షాలు కురిసి 12 రోజులవుతున్నా ఇంకా చాలా చోట్ల పొలాల్లో నీరు నిలిచి ఉంది. మండలంలోని కాశీపూర్, కలివేముల, మక్త అల్లూరు, తోపుగొండ తదితర గ్రామాల్లో పొలాల్లో వరద నీరు నిలువడంతో పత్తి మొక్కలు నల్లబడి పిందెలు రాలి పోతున్నాయి. అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికి అందకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి తమకు నష్ట పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.

◆ వేతనాలు చెల్లించాలి

నారాయణఖేడ్: మినీ అంగన్‌వాడీ టీచర్లకు పూర్తి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్‌లో నిర్వహించిన సంఘం డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీసవేతనంగా రూ.26 వేలు, సహాయకులకు రూ.21 వేలు చెల్లించడంతోపాటు పదవీవిరమణ సమయంలో టీచర్లకు రూ.2 లక్షలు, సహాయకులకు రూ.లక్ష చొప్పున చెల్లించాలన్నారు. సంఘం నాయకులు అశోక్, గణపతి, రాము, సతీష్ పాల్గొన్నారు.

◆ ఇళ్ల స్థలాలపై పరిశీలన

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డిలో దళితులకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై మంగళవారం తహసీల్దార్ శివ శ్రీనివాస్ పరిశీలించారు. 1999 సంవత్సరంలో మోడల్ కాలనీ ఏర్పాటు కోసం సర్వే నంబర్ 10లో 74 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినా.. పొజిషన్ చూపలేదని పలువురు లబ్ధిదారులు ఇటీవల ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అధికారులతో మొరపెట్టుకున్నారు. దీంతో తహసీల్దార్ శివ శ్రీనివాస్ సర్వే నంబర్ 10లో ఉన్న భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మల్లేశం, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ సాయిలు పాల్గొన్నారు.

◆ చరిత్రను వక్రీకరించడం సరికాదు

నారాయణఖేడ్: తెలంగాణ రైతాంగ చరిత్రను వక్రీకరించడం సరికాదని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు తుకారాంనాయక్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపును పురస్కరించుకొని మంగళవారం ఖేడ్‌లో పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటంలో 4 వేలకు పైగా రైతులు బలయ్యారన్నారు. 10 వేల ఎకరాలకు పైగా భూములు పేదలకు దక్కాయని గుర్తు చేశారు. నాయకులు తెలంకటి కుమార్, కొండయ్య, రాజు పాల్గొన్నారు.

◆ అత్యధిక సభ్యత్వాలతో సత్తాచాటాలి

నారాయణఖేడ్: బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా అత్యధిక సభ్యత్వాలు చేయించి సత్తాచాటాలని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఖేడ్‌లో మంగళవారం బీజేపీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం గల అతిపెద్దపార్టీ అని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. పార్టీ రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులు బస్వరాజ్‌పాటిల్, అరుణ్ శేరికార్, రాజు రాథోడ్, పత్తిరి రామకృష్ణ పాల్గొన్నారు.

◆ అనంతపద్మనాభ స్వామి చతుర్దశి వేడుకలు

సంగారెడ్డి : చౌటకుర్ మండలం చక్రియాల్ గ్రామంలో అనంతపద్మనాభ స్వామి చతుర్దశి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రామకృష్ణ రాజ శర్మ, కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామస్తులు లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

◆ వృద్ధుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తినడానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం అందోల్ మండలం సంగుపేట్‌కు చెందిన ఎర్రోళ్ల దుర్గయ్య కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు మంగళవారం అతడిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో తినడానికి అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా దుర్గయ్య ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం రాత్రి పోలీసుకలకు ఫిర్యాదు చేశారు.

తండాకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వంగ్దల్ గైర్హాన్ తండాకు రోడ్డు సౌకర్యం కలిపిస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి గైర్హాన్ తండాను సందర్శించారు. వాగులో కాలినడక నడిచి సమస్యను స్వయంగా పరిశీలించారు. తండా వాసులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు లేక కష్టాలు పడుతున్నామని గిరిజనులు వివరించారు. రోడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదవరెడ్డి, రమేష్‌చౌహాన్ పాల్గొన్నారు.